
ప్రజాశక్తి
శుక్రవారం 22 సెప్టెంబర్ 2023



నీటమునిగిన ఇన్‌ఫిల్ట్రేషన్ బావులు



ముంపునకు గురైన ఇన్‌ఫిల్ట్రేషన్ బావి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఎగువ ప్రాంతాల నుండి వచ్చే వరద నీరు ఎక్కువగా నాగావళి నదిలోకి చేరుకోవడంతో ఇరిగేషన్ అధికారులు బుధవారం రాత్రి తోటపల్లి రిజర్వాయర్ గేట్లును ఎత్తివేశారు. దీంతో రిజర్వాయర్ దిగువన పట్టణ ప్రజలకు తాగునీరం దించే ఇన్‌ఫిల్టరేషన్ బావులపై నుండి వరద నీరు ప్రవహిస్తుంది. ఈ విషయమై పంప్ హౌస్ వద్ద ఉన్న తాగునీటి విభాగం సిబ్బంది మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో పట్టణంలో పలు వార్డుల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.



కర్రివలసలో వర్షాభావంతో ఎదుగుదల లేని మొక్కజొన్న

పార్వతీపురం మన్యం జిల్లాలో మొక్కజొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో దెబ్బతింది. విజయనగరం జిల్లాలో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. అదును తప్పిన వర్షాలే ఇందుకు కారణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని మన్యం జిల్లాలోని మొక్కజన్న రైతులు వాపోతుండగా, అసలు పూర్తిస్థాయిలో విత్తనాలు నాటేందుకు కూడా అవకాశం లేకపోయిందని విజయనగరం జిల్లాకు చెందిన వారు చెబుతున్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వరి తరువాత అంతటి ప్రాధాన్యత గల పంట మొక్కజొన్న. ఈ రెండు జిల్లాల్లో కలిపి దాదాపు 76వేల ఎకరాల్లో సాగవుతుంది. వరుణడు అదును తప్పించడంతో ఈ రెండు జిల్లాల్లో భిన్నమైన రీతిలో రైతులు నష్టాలు చవిచూడాల్సి వస్తుంది.

దెబ్బతిన్న మొక్కజొన్న

- విజయనగరంలో తగ్గిన విస్తీర్ణం
- ఆందోళనలో అన్నదాత

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ ఏడాది మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం సుమారు 36వేల ఎకరాలు కాగా, జూన్‌లో కురిసిన కొద్దిపాటి వర్షాలకు 34,682 ఎకరాల్లో రైతులు వేశారు. అత్యధికంగా పాచిపెంట మండలంలో 15,430 ఎకరాలు, సాలూరులో 13,612 ఎకరాలు, మక్కువలో 1917ఎకరాల్లో మొక్కజొన్న సాగు నమోదైంది. మిగిలిన మండలాల్లో దాదాపు 500 నుంచి 1500 ఎకరాల వరకు నాటారు. ఆగస్టులో పొట్టవచ్చే సమయం నుంచి కంకికట్టే సమయం వరకు చుక్కనీరు లేకపోవడంతో మోడుబారిపోయాయి. పాచిపెంట మండలం పాచిపెంట, కర్రివలస, కోనవలస, మోసూరు తదితర గ్రామాల్లో ప్రజాశక్తి పరిశీలించగా ఏపుగా పెరిగిన మొక్కజొన్న కంకులు మోడువారుతూ కనిపించాయి. తరువాత వర్షాలు పడినా మొక్కలు తేరుకునే పరిస్థితి కనిపించలేదు. పంట వెన్నుపొడిచే సమయంలో వర్షాలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయామని కర్రివలసకు చెందిన రైతు సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. సాలూరు, మక్కువ మండలాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

విజయనగరం జిల్లాలో 40వేల ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా, 24,055 ఎకరాల్లో మాత్రమే రైతులు నాటారు. తగిన వర్షాలు లేకపోవడంతో చాలా మంది రైతులు అరకొరగాను, కొంతమంది రైతులు పూర్తిగాను మొక్కజొన్న వేయడం మానుకున్నారు. దీంతో, కొన్ని మండలాల్లో విస్తీర్ణం తగ్గిపోగా, మరికొన్ని మండలాల్లో ఒక్క ఎకరాలో కూడా నాటని పరిస్థితి. పూసపాటిరేగ మండలంలో 820 ఎకరాల్లో సాగు కావాల్సివుండగా కేవలం 15ఎకరాల్లో నలుగురు రైతులు మాత్రమే సాగుచేశారు. భోగాపురం మండలంలో 110 ఎకరాల్లో సాగు కావాల్సివుండగా ఒక్క సెంటులో కూడా సాగు కాలేదు. డెంకాడలో 415 ఎకరాలకు గాను 37 ఎకరాల్లో మాత్రమే సాగైంది. దాదాపు అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి. మరోవైపు తోటపల్లి నీరు అందకపోవడం, వర్షాభావ పరిస్థితుల వల్ల జిల్లాలో వరినాట్లు కూడా పూర్తికాలేదు. ఇటు మొక్కజొన్న విస్తీర్ణం ఘననీయంగా తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోకపోతే అప్పలపాలే



ప్రభుత్వం ఆదుకోకపోతే అప్పులపాలైపోతాము. వర్షాలు అదును తప్పడం వల్ల పంట దిగుబడి మూడో వంతు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. జూన్‌లో కురిసిన వర్షాలకు 2.50 ఎకరాల్లో మొక్కజొన్న నాటాను. దుక్కి, విత్తనాలు, డిఎపి, యురియా తదితర ఎరువులు తదితరాల మదుపు ఎకరాకు సుమారు రూ.30వేల చొప్పున మొత్తంగా రూ.75వేలకుపైగా ఖర్చు అయ్యింది. పంటలో ఎదుగుదల లేకపోవడంతో దిక్కుతోచడం లేదు.

సామురోతు సుదర్శనరావు,
మొక్కజొన్న రైతు, కర్రివలస, పాచిపెంట మండలం

ఒక్క ఎకరాలోనూ నాటలేదు



నాకున్న భూమిలో మూడు ఎకరాల వరకు మొక్కజొన్న నాటేవాడ్ని. ఈ ఏడాది వర్షాభావం వల్ల ఒక్క ఎకరాలోనూ వేయలేదు. స్థానికంగా వర్షాలు కురవకపోయినా తోటపల్లి నీరు వస్తుందన్న ఆశ కూడా లేకపోవడంతో మొక్కజొన్న నాటేందుకు సాహశించలేక పోయాం. ఇటీవల వర్షాలు కురుస్తున్నప్పటికీ సీజన్ దాటుతుండడంతో సాగు ఆలోచన విరమించుకున్నాను.

- కె.గోవింద,
మొక్కజొన రైతు, కనిమెట్ట గ్రామం, పూసపాటిరేగ మండలం

ఏజెన్సీలో ఎస్‌టి కమిషన్ పర్యటన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో గిరిజన విద్యా ప్రమాణాలు, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు అనంత నాయక్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాకు మొదటిసారిగా వచ్చిన ఆయన గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్థానికంగా ఉన్న ఏకలవ్య ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థినులు ప్రతీ ఏటా నిర్వహించే గిరిజనోత్సవాల్లో సవర, కంది కొత్తలు నృత్యాలు ప్రదర్శిస్తున్నట్లు తెలపడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. షెడ్యూలు తెగలలో ఎంతమంది విద్యార్థులు ఉంటున్నారని అడగ్గా సవర, కొండ దొర, సవర వంటి వర్గాల విద్యార్థులు విద్య ను అభ్యసిస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్ వివరించారు. ఇక్కడ చదువుతున్న విద్యార్థులతో సమావేశమయ్యారు. విద్యా బోధన ఏ విధంగా జరుగుతుంది, క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్తున్నారా లేదా, చదువులో ఏ మేరకు పట్టుసాధించారు అన్న విషయాలను విద్యార్థుల నుంచి అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనాలు సక్రమంగా పెడుతున్నారా లేదా? ఏఏ సమయాల్లో భోజనాలు పెడుతున్నారు, ఆటలు, భరతనాట్యం వంటివి నేర్పుతున్నారా అని విద్యార్థులను అడిగారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జిసిసి, వెలుగు, ఐటిడిఎ ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్ పరిశీలించారు. అనంతరం గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. వైద్యులతో మాట్లాడుతూ రోజు వారి ఒపి, రోగులకు అందుతున్న సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. తాగునీరు, మరుగుదొడ్లు పరిశీలించారు. ఈ

ఏకలవ్య విద్యార్థులతో అనంత నాయక్ ముఖాముఖీ



విద్యార్థులతో ముచ్చటిస్తున్న జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు అనంతనాయక్

కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ స్టేట్ డైరెక్టర్ సుశీల, గిరిజన సంక్షేమశాఖ డిడి శ్రీనివాసరావు, జిసిసి డిఎం మహేంద్ర కుమార్, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపల్ పెంటన్న, పలు శాఖల అధికారులు ఉన్నారు.

కురుపాం : మండలంలో నీలకంఠాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలికల పాఠశాలను జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు అనంత నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు పాఠశాలలో గల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా పుష్పగుచ్చలతో స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన డెమో యూనిట్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు రుచికరమైన భోజనాన్ని సక్రమంగా అందించి పాఠశాల ఆవరణ ప్రాంతంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి విద్యార్థుల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిడి కె.శ్రీనివాసరావు, ఎటిడబ్ల్యుఒ కె.చంద్రబాబు, ఎంపిడిఒ వివి శివరామప్ప, పాఠశాల హెచ్‌ఎం గిరిజారాని, హాస్టల్ సంక్షేమాధికారి ఒమ్మి చిలకమ్మ, స్థానిక సర్పంచ్ ఎ.మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

బెలగాం : గిరిజన ప్రాంతాల్లోని సమస్యలు పరిష్కరించాలని పలు గిరిజన సంఘాలు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులకు విన్నవించారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గిరిజన సంఘాల నుంచి వినతులు స్వీకరించారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలకు పూర్తి స్థాయిలో భవన నిర్మాణాలు చేపట్టాలని, విద్యార్థులు, సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏనుగుల సమస్యల పరిష్కరించాలని, పూర్ణపాడు -లాబేసు వంతెన నిర్మాణం జరగాలని, 1/70 చట్టం అమలు జరగాలని, తాగు నీటి సమస్య, గిరిజన ప్రాంత పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. బోయ, వాల్మీలను గిరిజన తెగల్లో చేర్చకూడదని, గిరిజన యూనివర్సిటీ గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేక నోటిఫికేషన్ ఇవ్వాలని గిరిజన సంఘనాయకులు వినతులు ఇచ్చారు. ఐటిడిఎ పాలక మండలి సమావేశం నిర్దిష్ట సమయంలో జరగడంలేదని, నిధులు గిరిజనుల కోసమే ఖర్చు చేయాలని, ఎస్టీ ప్రాంతంలో ఉద్యోగాలు ఎస్టీ లతోనే భర్తీ చేయాలని, గిరిజన ప్రాంతాల్లో ఖనిజాలు గిరిజనులు వెలికతీసేందుకు మాత్రమే అనుమతులు మంజూరు చేయాలని కోరారు. వీటిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని సభ్యులు తెలిపారు. వినతులు సమర్పించిన వారిలో పల్లా సురేష్, కె.మల్లేశ్వర రావు, ఎం. గిరిధర్, ఎం. పాపారావు, పి. రంజిత్ కుమార్ తదితరులు ఉన్నారు.



జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యుడికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఐటిడిఎ పిఒ

ఎస్‌టి కమిషన్ సభ్యులకు స్వాగతం

బెలగాం : జాతీయ గిరిజన తెగలు కమిషన్ సభ్యులు అనంత నాయక్ సాదర స్వాగతం లభించింది. జిల్లా పర్యటనకు విచ్చేసిన సందర్భంగా మండలంలోని ఉల్లిభద్ర గెస్ట్ హౌస్ వద్ద జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఎస్‌పి విక్రాంత్ పాటిల్, ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, ఆర్‌డిఒ కె.హేమలత, జిల్లా గిరిజన సంక్షేమశాఖ డిడి కె.శ్రీనివాసరావు పుష్ప గుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గిరిజన అభ్యున్నతికి జిల్లాలో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో తసీల్దార్ జి.వెంకట జనార్ధన, తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే స్టీల్‌ప్లాంట్‌కు రక్షణ

బైక్ యాత్రలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- నెల్లిమర్ల, గరివిడి, రాజాం, విజయనగరంటౌన్

ఐక్య పోరాటాల ద్వారానే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోగలమని సిపిఎం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. లోక నాథం అన్నారు. 'విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ యాత్ర' పేరిట సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన బైక్‌ర్యాలీ గురువారం విజయనగరం నుంచి నెల్లిమర్ల చేరుకుంది. అక్కడి నుంచి గరివిడి, రాజాం మీదుగా శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల చేరుకుంది. ఈ సందర్భంగా నెల్లిమర్ల మండలం మొయిద జంక్షన్, గరివిడి పెట్రోల్‌బంకు జంక్షన్, రాజాం అంబేద్కర్ జంక్షన్‌లో బైక్‌యాత్రకు పలు ప్రజాసంఘాల నాయకులు, కార్మికులు, స్కీం వర్కర్లు, ప్రజలు స్వాగతం పలికారు. గరివిడిలో బైక్ యాత్ర చేపట్టిన నాయకులపై పూలు చల్లి స్వాగతించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని నినాదాలు చేశారు. మోడీ పాలన తీరుపై పాటలు పాడుతూ డాన్సులు చేశారు. ఆయా సెంటర్లలోజరిగిన సభల్లో సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం కాకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా సి పిఎం ఆధ్వర్యంలో ఉక్కు రక్షణ బైక్ యాత్రను చేపట్టిందని తెలిపారు. పోరాటాల ద్వారా స్టీల్ ప్లాంట్ పరిరక్షించు కోవాలని పిలుపునిచ్చారు. మోడీ నేతృత్వంలో బిజెపి ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అమ్మేస్తోందని, అందులో భాగంగానే ఎల్‌ఐసి , బిఎస్‌ఎన్‌ఎల్, రైల్వే, విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి పూనుకుం దన్నారు. విశాఖ ఉక్కును పరిరక్షించాలని 1000రోజులుగా ప్రజలు, కార్మికులు పోరాటం చేస్తున్నారని, వారిని ప్రభుత్వం భయ పెడుతున్నా మొక్క వోని ధైర్యం తో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. అధికార వైసిపి, ప్రతిపక్షాలు టిడిపి, జనసేన కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలను, ప్రైవేటీకరణను అడుకోవడం లేదని అన్నారు. స్టీల్‌ప్లాంట్‌పై ఉత్తరాంధ్ర నుంచి సుమారు 2 లక్షల కుటుంబాలు ఆధారపడి బతుకుతున్నాయని, అలాంటి పరిశ్రమను నేడు పోస్కో లాంటి కంపెనీ లకు అమ్మేయాలని ప్రయత్నించడం దుర్మార్గమని అన్నారు. ఐక్య పోరాటాల ద్వారా పరిరక్షించు కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, రెడ్డి శంకర్రావు, స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకులు రామారావు, సిఐటియు టివి రమణ, కె.సురేష్, ఎ.జగన్మోహనరావు, బి.సుధారాణి, ఎ.గౌరి నాయుడు, జె.విశ్వనాథరాజు, బి.రమణ, కిల్లంపల్లి రామారావు, కె.రామ్మూర్తి నాయుడు, ఎస్‌ఎఫ్ నాయకులు పి.రామ్మోహన్, ప్రభాకర్, జితేంద్ర, ఫ్యాకర్ కార్మికులు పాల్గొన్నారు.



నెల్లిమర్లలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

గురజాడకు నివాళి

తొలుత విజయనగరంలో గురజాడ 161వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సిపిఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోక్‌నాథం, జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడారు. గురజాడ అప్పారావు స్ఫూర్తితో ప్రజాస్వామ్య పరిరక్షణకు, భావప్రకటనా స్వేచ్ఛకు ఆటంకం కలిగిస్తున్న పాలకుల విధానాలను ప్రజలు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. గురజాడకు నిజమైన వారసులు కమ్యూనిస్టు లేనని అన్నారు. అనంతరం రెండోరోజు బైక్‌ర్యాలీ ప్రారంభమైంది. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు, రామ్మోహన్, పి.రమణమ్మ, ఎ.జగన్మోహన్, బి.రమణ పాల్గొన్నారు.



విజయనగరంటౌన్.. గురజాడ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం, తదితరులు

ఉత్తరాంధ్ర బైక్ యాత్ర జయప్రదానికి ప్రచారం

ప్రజాశక్తి - కురుపాం

విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఉక్కు రక్షణ యాత్ర సిపిఎం ఆధ్వర్యంలో చేపడుతున్న బైక్ యాత్రను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. గురువారం స్థానిక వారపు సంత, విద్యాసంస్థలు, బజార్లు వద్ద సిపిఎం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగే బైక్ ప్రచార యాత్ర కార్యక్రమానికి ముఖ్య తిరిగే ఆయన హాజరై కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24న రావాడ జంక్షన్ వద్ద బైక్ యాత్ర చేరుకుంటుందని అన్నారు. అక్కడ సభ ఉంటుందని ఆ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, ఉత్తరాంధ్ర నాయకులు, జిల్లా కార్యదర్శులు పాల్గొంటారని తెలిపారు. కావున ఆ సభకు నియోజకవర్గంలోని యువత జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.సింహాచలం తదితరులు పాల్గొన్నారు. **సాలూరు రూరల్ :** ఉక్కు రక్షణ బైక్ యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని బాగువలసలో సిపిఎం ఆధ్వర్యంలో గోడపత్రిక విడుదల చేసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కూనేటి చినబాబు, కంచూరి బంగార్రాజు, గబడారు శ్రీను తదితరులు పాల్గొన్నారు. **సీతానగరం :** ఉక్కు రక్షణ బైక్ యాత్ర జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మునాయుడు, మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు కోరారు. . **కొమరాడ :** సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యాన కొమరాడలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలి నాయుడు, బిబి మధుసూదన్‌రావు, వెంకటనాయుడు, సింహాచలం, ఆదిబాబు, సాయిరాం, హక్కుల నాయుడు, స్వామినాయుడు ఉన్నారు. **బలిజిపేట:** ఉక్కు రక్షణ బైక్ యాత్ర జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యమ్మల మన్మధరావు స్థానిక పిఎస్‌ఎన్ జూనియర్ కాలేజీలో ప్రచారం చేశారు. **సీతంపేట:** విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణపై ఐటిడిఎలో సిపిఎం నాయకులు జీలకర్ర శ్రీరాములు, సాయికుమార్ తదితరులు కరపత్రాలు పంపిణీ చేశారు.

మానవతామూర్తి గురజాడ

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మనిషిని ప్రేమించడం తన మతంగా చెప్పుకున్న మానవతా మూర్తి గురజాడ అప్పారావు జయంతి వేడుకలు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్నేహ కళా సాహితి, సాహితీ లహరి సభ్యులు ప్రముఖ రచయిత గంటేడ గౌరినాయుడు, మంచిపల్లి శ్రీరాములు, సభ్యులు స్థానిక జిల్లా కేంద్రాసుపత్రి కూడలిలో గల మహాకవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు తన కార్యకర్తలతో కలిసి గురజాడకు పూలమాలలతో నివాళులు అర్పించారు. అలాగే మండలంలోని డోకిసీల గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం గోవిందరావు గురజాడ చిత్రపటానికి విద్యార్థులతో కలిసి పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గురజాడ గురించి పలువురు సాహితీ అభిమానులు రచయితలు, కవులు కళాకారులు మాట్లాడారు. కార్యక్రమంలో మళ్లీపురం జగదీష్, పక్కి రవీంద్రనాథ్, చిత్రకారుడు గోరా, సిరికి స్వామి నాయుడు, గడగమ్మ, రామకష్ణ, నాగు కాకిముక్కల, పలువురు సాహితీ అభిమానులు పాల్గొన్నారు. **పార్వతీపురంటౌన్ :** వాడుక భాషలో మొట్టమొదటి కవిత్వం రాసిన మహాకవి గురజాడ అప్పారావు అని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి అన్నారు. గురజాడ అప్పారావు జయంతి ఐద్వా, సిఐటియు ఆధ్వర్యాన పట్టణంలోని వివేకనంద కాలనీ, ఉజ్జిడితల్లివీధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో గౌరమ్మ, జయలక్ష్మి, గౌతమి, మహిళలు పాల్గొన్నారు. **వీరఘట్టం:** మండలంలో గురజాడ అప్పారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిమ్మి గ్రామఎంపిపి పాఠశాల విద్యార్థులు మానవహారం నిర్వహించి దేశభక్తి గేయాన్ని ఆలపించారు. **గుమ్మలక్ష్మీపురం:** తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవి, కన్యాశుల్కం నాటక రచయిత, అభ్యుదయ కవితా పితామహుడు, కవి శేఖర బిరుదాంకితుడు మహాకవి గురజాడ అప్పారావు అడుగుజాడల్లో ప్రతి ఒక్క విద్యార్థి నడవాలని దిగువ మండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పాలక దేవానంద్ కోరారు. గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా పాఠశాలలో ఆయన చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు. **కొమరాడ :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురజాడ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ వై.నాగేశ్వరరావు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలవసి నివాళులర్పించారు. తెలుగుజాతి ఖ్యాతిని పెంచిన వ్యక్తి గురజాడని అన్నారు. సమాజాన్ని మార్చేందుకు గురజాడ తన కవిత్వాలు రచనలతో ప్రజలను మార్చిన గొప్ప వ్యక్తిని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు ఉద్యోగులు పాల్గొన్నారు. **సీతంపేట :** స్థానిక బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గురజాడ అప్పారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.లిల్లీరాణి గురజాడ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




గురజాడ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

ప్రభుత్వ పాఠశాల ముంపు

- ఐదేళ్లుగా ఇదే సమస్య
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆ పాఠశాల వరద నీటితో పూర్తిగా మునిగిపోతుంది. దీంతో ఇక్కడ చదువుతున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఐదేళ్ల నుంచి ఇదే సమస్య ఉందని ఉపాధ్యాయులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... జియమ్మవలస మండలం నిర్వాసిత గ్రామమైన బాసంగిలో గల ఎంపిపి పాఠశాల వర్షాకాలం వచ్చిందంటే చాలు నీటితో పూర్తిగా ముంపుకు గురవుతోంది. దీంతో ఇక్కడ చదువుతున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఉపాధ్యాయులు గ్రామంలో ఉన్న ఇళ్ల వద్ద తరగతులను నిర్వహించాల్సి వస్తోంది. నీటి ప్రవాహానికి పాములు, విష కీటకాలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటి ఒడ్డున పాఠశాల ఉండడంతో ప్రతి ఏటా ముంపునకు గురి కావడంతో, తల్లిదండ్రులు తమ పిల్లల్ని పంపడానికి ఇష్టపడడం లేదని, విద్యార్థుల సంఖ్య కూడా తగ్గుతూ వస్తుందని ఉపాధ్యాయులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వరద ముంపునకు గురైన బాసంగి

తాగునీటి సమస్యపై అసెంబ్లీలో ప్రస్తావన

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పార్వతీపురం మున్సిపాలిటీలో నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య పరిష్కరించేందుకు పనులు వేగవంతం అయ్యేలా అధికారులకు ఆదేశించాలని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు బుధవారం శాసనసభలో ప్రసనోత్తరాలు సమయంలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన స్పీకర్ తమ్మినేనిని ఉద్దేశించి మాట్లాడుతూ గతంలో ఈ సమస్య ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా పట్టణంలో తాగునీటి అందించేందుకు రూ.63 కోట్లు మంజూరు చేసిందని, అయితే ఇందులో రూ.7 కోట్లతో పైపులు కొనడం జరిగిందని, ఆ తరువాత పనులు పడకేశాయని అన్నారు. ఈ సమస్యను మున్సిపల్ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. వెంటనే స్పందించిన సంబంధిత మంత్రి తగుచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మున్సిపల్ కమిషనర్‌గా జయరాం

ప్రజాశక్తి- సాలూరు



స్థానిక మున్సిపాలిటీ ఇంఛార్జి కమిషనర్‌గా తుమ్మి జయరామ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. గురువారం ఆయన పూర్తి అదనపు బాధ్యతలతో ఇంఛార్జి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇంఛార్జి కమిషనర్‌గా వున్న ఎఇ సూరి నాయుడు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్ జయరాం మాట్లాడుతూ పట్టణ సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

జాతాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా ఈనెల 22వ తేదీన సీతంపేటలో జరిగే జాతాను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని నడిమికెల్ల, కంబరవలస, వీర ఘట్టం బాలుర, బాలికల, నర్సిపురం కత్తుల కవిటి నర్సిపురం గోర పాఠశాలలు సందర్శించి యుటిఎఫ్ స్వర్ణోత్సవ పోస్టర్లు ఆవిష్కరించారు. అక్టోబర్ ఒకటో తేదీన విజయవాడలో జరిగే స్వర్ణోత్సవ వేడుకల్లో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు, మండల అధ్యక్షులు బి దుర్గాప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి గోవిందరావు, ఎ స్వామి బాబు, ఎస్ సతీష్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శేషాచారి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోనే శ్రీరామ మందిరం అర్చకులు శేషాచారి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదే గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు గురువారం శేషాచారి భార్యకు రూ.8వేలు నగదుతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు ఎం పుండరీకం, బత్తుల ఖుషీవాన్, క్రైరాన్, చింత గోవర్ధన్, లంక ప్రభాకర్, కంటూ గణేష్, మజ్జి శరత్, కంటూ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెద్దూరులో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని దశమంతపురం పంచాయతీ పరిధి పెద్దూరులో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి ఉమామహేశ్వరి జ్వర పీడితులకు, గర్భిణీలకు, మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధిగ్రస్తులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఓ.శాంతకుమారి, ఎఎన్ఎం హేమ, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నాడు- నేడు పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

పాఠశాలలో పెండింగ్ ఉన్న నాడు- నేడు పనులను పూర్తి చేయాలని ఎంపిడిఒ ఎంఎల్ఎస్ఎన్ ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. మనబడి కింద మంజూరైన పనులన్నీ పూర్తి చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో గడపగడపకు కార్యక్రమంలో మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఉన్న పిచ్చి మొక్కలను ఇఒ జి.వెంకట్రావు, పెదబోగిలి సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ, గరికయ్య ఆధ్వర్యంలో పిచ్చి మొక్కలు తొలగిస్తూ శుభ్రం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులు ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి వాహనదారులకు ఎటువంటి అసౌకర్యం కలిగించకుండా ఉండేందుకు చర్యలు చేపట్టామన్నారు. వారం రోజులుగా ఈ మొక్కలను తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన అన్నారు.

ఒకే రోజు ఏరియా ఆస్పత్రిలో 9 ప్రసవాలు

ప్రజాశక్తి- సీతంపేట

స్థానిక ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ బి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం 9 ప్రసవాలు జరిగినట్లు తెలిపారు. వీటిలో ఒకటి ఆపరేషన్ అయిందని మత్తు డాక్టర్ గౌరీ శంకర్ సహాయంతో చేశామని తెలిపారు. ఒకే రోజు 9 ప్రసవాలు జరగడం ఈ ఆస్పత్రిలో ఇదే మొదటి సారని ఆయన వెల్లడించారు.


క్షేత్ర స్థాయిలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

అధికారుల క్షేత్ర పర్యటన

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని పెద్ద బొండపల్లిలో గురువారం రైతు సాధికార సంస్థ అధికారులు రాధామాధవ్ రాజేష్, రీజనల్ ఆఫీసర్స్ కె.ప్రకాష్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖ రాజు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పర్యటించి నేరుగా రైతులతో మాట్లాడి రైతు ఆచరిస్తున్న పద్ధతులను పంటల దిగుబడులను నేరుగా రైతులను అడిగి తెలుసు కున్నారు. ప్రకృతి వ్యవ సాయం చేయడం వల్ల ఆరోగ్య పరిస్థి తులు బాగున్నాయని రైతు అప్పల నాయుడు, చిన్న రామినాయుడు, సిం హాద్రి నా యుడు తెలిపారు.

ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి - కొమరాడ

వసతి గృహ (హాస్టల్) విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహన రావు సిబ్బందికి సూచించారు. ఈ మేరకు ఆయన స్థానిక బిఆర్ అంబేద్కర్ గురుకులం, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహం, గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను వైద్య బృందం తో కలిసి గురువారం సందర్శించారు. ముఖ్యంగా విద్యార్థుల ఆరోగ్య తనిఖీ వివరాలు, హీమోగ్లోబిన్ రక్త పరీక్షల వివరాలు, వీరిలో రక్తహీనత గుర్తించింది ఎంతమంది? ఐరన్ మాత్రలు ఏ విధంగా వేస్తున్నారు తదితర అంశాలపై సిబ్బందిని ఆరా తీశారు. వివరాలు సంబంధిత యాప్‌లో నమోదు చేశారో, లేదో పరిశీలించారు. అనంతరం సిక్ రూంలో ఉన్న విద్యార్థుల అరోగ్య పరిస్థితిని పర్యవేక్షి ంచారు. వారికి అందజేస్తున్న చికిత్సను సిబ్బందిని అడిగి తెలుసుకుని తగు సూచనలు చేశారు. విద్యార్థుల అరోగ్యంతో పాటు, వారు ఎటువంటి మానసిక ఒత్తిడికిలోను కాకుండా హాస్టల్, వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య కార్యా లయ డెమో యోగీశ్వర రెడ్డి, ప్రిన్సిపాళ్లు జి.లక్ష్మి, డి.లక్ష్మణ రావు, ఎం.రమాదేవి(ఇన్చార్జి), ఎఎన్ఎం దేవి, ఆశా కార్యకర్తలు, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న డిఐఒ

అంకితభావంతో పనిచేయండి

జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు నాయక్


మాట్లాడుతున్న అనంత నాయక్

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమానికి అంకితభావంతో పనిచేసి, వారి జీవితాలలో వెలుగులు నింపాలని జాతీయ షెడ్యూలు తెగల కులాల కమిషన్ సభ్యులు అనంత నాయక్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా గుమ్మలక్ష్మి పురం ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల, నీలకంఠా పురం గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలలను గురువారం సందర్శించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అనంత నాయక్ మాట్లాడుతూ డా.బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగంలో గిరిజనుల అభివృద్ధికి పలు అధికరణలు చేర్చారన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు కృషి చేయాలన్నారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు విస్తరణ చేసేందుకు ఆరు బ్యాంకు శాఖలు ప్రతిపాదించామని చెప్పారు. ఆశావాహక జిల్లాల కేటగిరీలో జిల్లా ఉత్తమ ఫలితాలను సాధిస్తుందని వివరించారు. గిరిజన యువతకు నైపుణ్య అభివృద్ధి కల్పించి యువత మంచి ఉపాధి పొందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు వివరించారు. జిల్లాలో గిరిజనులు ప్రధాన జీవన స్రవంతిలోకి తీసుకొచ్చేందుకు యుయస్ఎఫ్ కార్యక్రమం కింద 190 మొబైల్ టవర్ల నిర్మాణాలకు మంజూరు అయ్యాయని చెప్పారు. అవసరమైన చోట్ల స్థలాలు మంజూరుకు, రహదారుల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సోమవారం జిల్లా కేంద్రంలో, బుధ, శుక్ర వారాల్లో మండలాల్లో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలో 27142 ఇళ్లకు మంజూరు కాగా, 11880 నిర్మాణం పూర్తి అయ్యాయని ఆయన చెప్పారు. జిల్లాలో 168 గ్రామ సచివాలయాలు, 111 రైతు భరోసా కేంద్రాలు, 180 వెల్ నెస్ కేంద్రాలు పూర్తి చేసామని చెప్పారు. వైద్య సేవల్లో భాగంగా ఎవై హెల్త్ కార్డుల జారీలో 97.34 శాతం సాధించామని చెప్పారు. శిశు మరణాలు నియంత్రణకు ఇమ్యునైజేషన్ కార్యక్రమం పక్కాగా చేపడుతున్నామనిపేర్కొన్నారు. ఆర్ఒఎఫ్ఆర్ చట్టం కింద 1.79 లక్షల ఎకరాలకు సంబంధించి 67506 పట్టాలను గిరిజనులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. సీతంపేట ప్రాంతంలో పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. రూ.2.67 కోట్లతో 9పనులు మంజూరు చేశామని చెప్పారు. విద్యుత్ సదుపాయం లేని గిరిజన గ్రామాలకు సౌర విద్యుత్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో జెసిఓ పి.విష్ణు చరణ్, డిఆర్ఒ జె.వెంకట రావు, కమిషన్ సభ్యులు - సంచాలకులు జయంత్ జె సరోడే, స్పెషల్ రిపోర్టర్ రాధాకాంత త్రిపాఠి, రీసెర్చ్ ఆఫీసర్ ఆర్.ఎస్. మిశ్రా, ప్రైవేట్ సెక్రెటరీ పి.కె.పరిడా, ట్రైబల్ రీసెర్చ్ మిషన్ ఇడి జి.చినబాబు, డాక్టర్ చుక్కా నాగరాజు, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి కె శ్రీనివాస రావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కేసులు

సాలూరు : బాల్య వివాహాలు చేస్తే కేసులు పెడతామని బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు చెప్పారు. గురువారం నీడ్ స్వచ్ఛంద సంస్థ, ఐసిడిఎస్ సాలూరు, పాచిపెంట ప్రాజెక్టుల ఆధ్వర్యాన బాల్య వివాహాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో కేసలి అప్పారావు మాట్లాడారు. బాల్య వివాహాలు చేయడం సామాజిక నేరమే కాదని పోలీసు కేసులు పెట్టడానికి సిద్ధమని చెప్పారు. తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పు వచ్చినప్పుడే బాల్య వివాహాలు అరికట్టవచ్చునని అన్నారు. ఆడపిల్లలకు 18ఏళ్లు, మగపిల్లల కు 21ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేయాలన్నారు. 12 నుంచి 16 ఏళ్ల మధ్య వయస్సులో పెళ్ళిళ్లు చేయడం వల్ల ఆడపిల్లలు అనేక హక్కులను కోల్పోతారని చెప్పారు. గ్రామాల్లో, ఏజెన్సీ ప్రాంతంలో బాల్య వివాహాల గురించి సమాచారం తెలిసిన వెంటనే స్థానిక పంచాయతీ కార్యదర్శి ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు.కార్యక్రమంలో డిసిపిఒలు సత్యనారాయణ, చిట్టిబాబు, ఐసిడిఎస్ సాలూరు, పాచిపెంట సిడిపిఒలు బి.సత్యవతి, అనంతలక్ష్మి, టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు, నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు, దిశా ఎస్ఐ పాల్గొన్నారు.

కొనసాగుతున్న టిడిపి నాయకుల దీక్షలు



కురుపాం: నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - కురుపాం

చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా స్థానిక టిడిపి కార్యాలయం వద్ద టిడిపి గిరిజన విభాగం సభ్యులు గురువారం రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు అన్ని వర్గాల ప్రజల నుంచి వైసిపి ప్రభుత్వానికి నిరసన తెలియజేస్తున్నా అయినప్పటికీ ప్రభుత్వానికి బుద్ధి రావడం లేదన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు కెవి కొండయ్య, పాడి సుధా, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, అరుకు పార్లమెంట్ ఎస్‌టి సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జి వెంకటరావు, ఎస్‌టి సెల్ సభ్యులు తాడంగి రామారావు, మాసయ్య ,టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **వీరఘట్టం** : స్థానిక స్టేట్ బ్యాంకు వద్ద పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో వీరఘట్టం, పాలకొండ మండలాల అధ్యక్షులు ఉదయాన ఉదయ్ భాస్కర్, గండి రామినాయుడు, రాష్ట్ర కార్యదర్శి కర్నేని అప్పలనాయుడు, ఎఎంసి మాజీ చైర్మన్ పి.కృష్ణమూర్తినాయుడు, బల్ల హరిబాబు, మాచర్ల అనిల్‌కుమార్, పి.వెంకటరమణ, ఎఎంసి మాజీ ఉపాధ్యక్షులు వెలగాడ శ్రీనివాసరావు, ఎన్.శశికుమార్, సిహెచ్ ఉమామహేశ్వరరావు, తాతబాబు, తూముల రమేష్, రాయిపల్లి రత్నాకర్, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు పాల్గొన్నారు. **సాలూరురూరల్ :** మండలంలోని మామిడిపల్లిలో డొంక రాము విగ్రహం వద్ద గిరిజన నాయకులు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జి.సంధ్యారాణి ఆధ్వర్యాన జరిగిన దీక్షల్లో మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్, పట్టణ అధ్యక్షులు నిమ్మాది చిట్టి, మక్కువ నాయకులు గుల్ల వేణు, పెంట తిరుపతి రావు, పాచిపెంట నాయకులు పిన్నింటి ప్రసాదు, పోలి నాయుడు, మెంటాడ మండల నాయకులు చలుమురి వెంకటరావు, సాలూరు మండల టిడిపి అధ్యక్షుడు ఆముదాల పరమేష్, బూస తవుడు, తాడుతూరి చినబాబు, బూస తిరుపతి రావు, బుజ్జి, రామారావు, అప్పికొండ తదితరులు పాల్గొన్నారు. **పార్వతీపురం రూరల్ :** మండలంలోని నర్సిపురంలో మాజీ సిఎం చంద్రబాబు అరెస్టుకు మద్దతుగా మహిళలు పెద్ద ఎత్తున నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ప్రకాష్, గొట్టాపు వెంకటరమణ, గొట్టాపు గౌరితో పాటుగా మహిళా నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. **భామిని :** మండల టిడిపి అధ్యక్షులు బోగాపురపు రవినాయుడు, ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం టిడిపి రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. సభ్యులు నల్ల కండువాలు ధరించి నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బిడ్డికి ప్రసాద్‌రావు, భూపతి ఆనందరావు, లోపింటి రాజేష్, కోరాడ రాజేష్, కృష్ణ చంద్ర దొర, అంపిలి కేశవ, జిల్లెడి రవి తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో రీసర్వే : ఆర్‌డి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భూ సర్వేను పక్కా ప్రణాళికతో నిర్వహించాలని రీజనల్ డైరెక్టర్ జి.నాగరాజు అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ఆయన కమిషనర్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సిడిఎంఎ) కోటేశ్వరరావు నిర్వహించిన భూ రీసర్వేపై జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో రీజనల్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (ఆర్‌డిఎంఎ) జి.నాగరాజు, మునిసిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, రెవెన్యూ అధికారి రూబేన్ దిబ్బా, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి పి. కనకారావు, ఆర్‌ఐలు, వార్డు సచివాలయాల అడ్మిన్, ప్లానింగ్, రెవెన్యూ సెక్రెటరీతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో గల వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, అర్బన్ రీసర్వేలో భాగంగా పట్టణంలో జరుగుతున్న అర్బన్ రీ సర్వేను పరిశీలించడానికి వచ్చామన్నారు. ఇందులో భాగంగా గ్రౌండ్ ట్రూతింగ్ డాక్యుమెంటేషన్ తక్కువగా కలెక్ట్ చేస్తున్నారని, దీన్ని వేగవంతం చేసి ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం రెవెన్యూ, పారిశుధ్య విభాగం అధికారులతో సమావేశమై పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనులకు క్లాప్, యూజర్ ఫీజులను పూర్తిస్థాయిలో వసూలు చేయాలని, కార్మికులచే ఇంటింటికి వ్యర్థాలను సేకరించాలని, వర్షాలు పడుతున్న దష్ట్యా సీజనల్ వ్యాధులు రాకుండా పారిశుధ్య నిర్వహణ చేయాలని ఆదేశించారు, రెవెన్యూ అధికారులతో మాట్లాడుతూ ఇంటి, కొళాయి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టి మున్సిపల్ ఆదాయాన్ని మెరుగుపరచాలని, కొళాయి పన్ను వసూలు తక్కువగా ఉందని దీనిమీద ప్రత్యేక డ్రైవ్ పెట్టి పూర్తిస్థాయిలో వసూలు చేసేలా ప్రణాళికలను సిద్ధం చేయాల్సిందిగా ఆదేశించారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

సక్రమంగా బోధించాలి

డిప్యూటీ కార్యదర్శి రామ్మోహన్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గురుకుల పాఠశాలలు, కళాశాలలో ఉపాధ్యాయులు బోధన సక్రమంగా చేపట్టి విద్యార్థుల భవిష్యత్తుకు పునాదిని వేయాలని గురుకులాల రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి రామ్మోహన్ అన్నారు. గురువారం ఆయన స్థానిక ఎపి గిరిజన గురుకుల బాలికల పాఠశా లకు (పీ టీ జీ) వచ్చిన సందర్భంగా ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. గురుకుల పాఠశాలలు, కళాశాలలు విద్యాబోధనలో మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న గురుకులాల్లో ఈ ఏడాది అన్ని పాఠశాలల్లో నూటికి నూరు శాతం పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణతను సాధించాలన్నారు. గురుకులల్లో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని అన్నారు. ఈ మేరకు డిప్యూటీ కార్యదర్శి రామ్మోహన్‌ను ఉపాధ్యాయులు, అధ్యాపకులు దుస్సాలువతో సత్కరించారు. అనంతరం ఆయన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట పార్వతపురం ఐటిడిఎ గురుకులాల ఓఎస్డి రామారావు, పిటిజి పాఠశాల ప్రిన్సిపల్ ఎన్. సుబ్రహ్మణ్యం, బాలుర గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ యుగంధర్ తదితరులు ఉన్నారు.


రామ్మోహన్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కె.వెంకటాపురంలో పొలంబడి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కె.వెంకటాపురంలో వైయస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఎఒ ఎస్.అవినాష్ మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి వస్తాయన్నారు. ఇందులో అమృతం తయారీ విధానం, జీవామృత విధానం రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతోనే ఎక్కువ లాభాలు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు


రైతులకు సూచనలు చేస్తున్న సిబ్బంది

ఇకెవైసి పూర్తి చేయాలి

రైతులకు త్వరితగతిగా ఇకెవైసి పూర్తి చేయాలని వ్యవసాయ సహాయ సంచాలకులు టి.వెంకటేష్ అన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలతో సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇ- పంట నమోదు ఈనెల 30 వరకు చేయాలన్నారు. ముందుగా ఇ-పంట నమోదు చేసినప్పుడు రైతులకు కూడా గ్రామ రెవెన్యూ సహాయకులు చేయాలన్నారు. ఈ సీజన్‌కు రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, కావున ప్రతి ఒక్క రైతును చేయించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎంవి రమణ, ఎఒ ఎస్.అవినాష్, వివిధ గ్రామాల రెవెన్యూ కార్యదర్శులు పాల్గొన్నారు.

గురజాడ రచనలు సజీవం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

వందేళ్లు దాటినా గురజాడ రచనలు ఇప్పటికీ నిత్యనూతనంగా ఉంటూ ప్రస్తుత సామాజిక సమస్యలకు సైతం అద్దం పడుతున్నాయని చదలవాడ సత్యనారాయణ అన్నారు. స్నేహకళా సాహితి గురువారం వేదాంత కళాశాలలో ఇచ్చిన గురజాడ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గురజాడ గొప్ప దార్శనికుడని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన పల్ల రోహిణీకుమార్ మాట్లాడుతూ గురజాడ అందించిన వారసత్వాన్ని ఇప్పటి రచయితలు అందిపుచ్చుకుని రచనలు చేయాలన్నారు. పార్వతీపురం అరసం కార్యదర్శి పాలకొల్లు రామలింగస్వామి, స్నేహకళా సాహితీ వ్యవస్థాపకులు గంటేడ గౌరునాయుడు, అరసం అధ్యక్షులు చింత అప్పలనాయుడు, మల్లిపురం జగదీశ్, చందనపల్లి గోపాలరావు, గంటేడ సోమేశ్వరరావు, పక్కి రవీంద్రనాథ్, టి.పద్మావతి, సిహెచ్ పారినాయుడు తదితరులు మాట్లాడారు. సమావేశంలో చిరంజీవి, రితిక్‌రెడ్డి గురజాడపై చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది.


వ్యాన్‌ను ట్రాక్టర్ సాయంతో లాగుతున్న నిర్వాహకులు

ఎరక్కపోయి వచ్చి ... ఇరుక్కుపోయి

ప్రజాశక్తి - వీరఘట్టం

జగనన్న కాలనీ లబ్ధిదారులకు సిమెంట్‌ను సరఫరా చేసే వాహనం గురువారం గృహ నిర్మాణ శాఖ కార్యాలయం వద్ద ఇరుక్కుపోయింది. మండల కేంద్రంలోని పాత తహశీల్దార్ కార్యాలయంలో నిల్వ ఉంచిన సిమెంటు బస్తాలను వాహనానికి ఎక్కించి లబ్ధిదారులకు సరఫరా చేసేందుకు వెళుతుండగా ఈ ఘటన జరిగింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కార్యాలయం ఎదుట బురద నిలిచిపోవడంతో అధికారులు మట్టిని తీసుకువచ్చి వేశారు. ఇందులో ఆ వాహనం ఇరుక్కుపోయింది. దీంతో ఎరక్కపోయి వచ్చి ఇరుక్కుపోయినట్లు అయిందని డ్రైవర్ వాపోయాడు. చాలా సమయం తరువాత ఇరుక్కుపోయిన వాహనాన్ని ట్రాక్టర్ ద్వారా బయటికి తీశారు.

డిఇగా కిరణ్ కుమార్

పార్వతీపురం టౌన్+ స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగంలో డిఇగా పి.కిరణ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో పాలకొండ, నెల్లిమర్ల నగర పంచాయతీల్లో ఎఇగా విధులను నిర్వహించారు. ఇటీవలే జిల్లా కేంద్రంలో ఉన్న పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్‌లో ఎఇగా విధులు నిర్వహిస్తూ మున్సిపల్ డిఇగా ఉద్యోగోన్నతిపై వచ్చారు.

నేరాలు ఘోరాలు

పూర్వ విద్యార్థి పేరుతో టోకరా..!

ప్రజాశక్తి - మక్కువ

'ఒరే బావ నేను హాస్పిటల్లో ఉన్నాను రా... నాకు అర్జెంటుగా అవసరం కొంత డబ్బులు పంపించరా.. అంటూ పలువురు స్నేహితుల వద్ద డబ్బులు దోచుకున్న విషయం వెలుగు చూసింది. మక్కువలో 2010-11 పూర్వ విద్యార్థులు కొందరు ఈ మాయగాడి వలలో పడి డబ్బులు పోగొట్టుకున్న ఘటన గురువారం వెలుగు చూసింది. దబ్బగెడ్డకు కర్రి వినోద్, బలివాడ శివశంకర్‌కు 6300247721 ఫోన్ నెంబర్ నుండి కాల్స్ వచ్చాయి. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి అనారోగ్యంగా ఉందంటూ డబ్బులు పంపాలంటూ కోరాడు. వీరికి అనుమానం వచ్చింది. వెంటనే విశాఖలో ఉంటున్న ఆ వ్యక్తికి ఫోన్ చేస్తే ఆరోగ్యం బాగోలేదని అడగ్గా తాను బాగా ఉన్నానని తాను ఎవరికీ ఫోన్ చేయలేదని చెప్పడంతో అసలు విషయం బయటపడింది. ఫేక్ కాల్‌గా స్నేహితులంతా గుర్తించడంతో అప్పటికే చాలామంది సుమారు రూ.30 వేల వరకు పంపించేయడంతో లబోదిబోమన్నారు. డబ్బులు పంపిన వారు అదే ఫోన్ నెంబర్‌కు మళ్లీ కాల్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ అని రావడంతో అంతా అవాక్కయ్యారు. మోసపోయామని తెలుసుకొని కొంతమంది పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. పూర్వ స్నేహాన్ని కూడా వినియోగించుకొని మోసం చేస్తూ ఉండడాన్ని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నకిలీ పోలీసుల వీరంగం

ప్రజాశక్తి - సాలూరురూరల్

అమాయకులైన జనాన్ని వివిధ రకాల పేరుతో మోసగిస్తున్న వ్యక్తులు సమాజంలో పోలీస్ లమని, బ్యాంక్ వారమని వివిధ రకాలుగా చెప్పుకొని ప్రజలను ముఖ్యంగా అమాయకులైన మారుమూల ప్రాంతాల ప్రజలు, గిరిజనులను నిత్యం మోసగిస్తున్న వైనం చూస్తూనే ఉన్నాం. అలాంటిదే గురువారం మధ్యాహ్నం కొదమ పంచాయతీ కొడంగివలసలో జరిగింది. అక్కడ ఉన్నవి ఏడిళ్లు. ఊరు చిన్నది కావడంతో అక్కడ అమాయక గిరిజనులు ఉండడం ఇదే సమయం అనుకొని నలుగురు వ్యక్తులు హెల్మెట్లు ధరించి బైక్‌లపై వచ్చి ఇంటికి వెళ్లి తాము పోలీసుల అని చెప్పి చోడిపిల్లి సుకిలి వద్ద తులంన్నర బంగారం, రూ.20వేలు, చోడిపిల్లి బొందురు వద్ద అరతులం బంగారం, రూ.20వేలు, చోడిపల్లి సన్నెమ్మ వద్ద తులమ్నర పుస్తెలు తాడు, రూ.50వేల రూపాయిలు నగదును తీసుకొని పరారయ్యారు. ఈ విషయంపై సంబంధిత బాధితులు సాలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి జరిగిన విషయాన్ని పోలీసులకు వివరించారు. రూరల్ సిఐ ధనంజయ నాయుడు, రూరల్ ఎస్ఐ ప్రయోగ మూర్తి సంఘటన స్థలానికి వెళ్లారు. ఈ సంఘటనను దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మినీవ్యాన్ బోల్తా

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో గుమ్మ గదబవలస వంతెన వద్ద అదుపు తప్పి మినీ వ్యాన్ బోల్తా పడిన సంఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది స్థానికులు అందించిన వివరాలు ప్రకారం మినీ వ్యాన్ గుమ్మలక్ష్మీపురం నుంచి పార్వతీపురం వెళ్తుండగా ఆర్టీసీ బస్సును తప్పించబోయి వంతెన వద్ద బోల్తా పడింది. ఆ సమయంలో మినీ వ్యాన్‌లో డ్రైవర్ తప్ప ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. డ్రైవర్ కూడా సురక్షితంగా బయటపడ్డాడు.

నేడు మక్కువలో జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నామని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులంతా హాజరుకానున్నారని ఆయన వెల్లడించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు బేబినాయన పాదయాత్ర ప్రారంభం

బొబ్బిలి : టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన శుక్రవారం పాదయాత్ర చేపట్టనున్నారు. బొబ్బిలి నుంచి సింహాచలం వరకు చేపట్టే ఈ పాదయాత్ర పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ప్రారంభం కానుంది. పాదయాత్రలో పాల్గొనేందుకు వందలాది మంది టిడిపి కార్యకర్తలు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం విజయనగరంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజును కలిసి పాదయాత్ర గురించి వివరించారు. ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.